# డబ్బు పాపిష్టిది!



డి. వి. ఎస్. ఆర్. మూర్తి

"**జీవితం** మిథ్య. ఈ ప్రపంచం మిథ్య. నీవూ నేనూ, భార్యా పిల్లలూ, భూమీ పుత్రా, ఇల్లూ వాకిలీ అన్నీ మిథ్య. ఇవేవీ మీతో రావు. మీ పాప పుణ్యాలే మీ వెంట వచ్చేవి. అందుకే జీవితం తామరాకు మీద నీటిబొట్టులా గడపాలి. రక్తిని, తృప్తిని ఆత్మలోనే చూడాలి" అంటూ శ్రీమన్నారాయణ భగవద్గీతపై అనర్గళంగా ఉపన్యాసం సాగిస్తున్నాడు.

ఆ ఉపన్యాసం వింటూన్న వాళ్ళందరికీ శ్రీమన్నారాయణ మహానుభావుడు. మహా వేదాంతి. జ్ఞాని. ధర్మమూర్తి. నిష్కామకర్మయోగి.

ఇంత జ్ఞానాన్ని, ఇంత నిర్మోహత్వాన్ని అతడు ఎలా సాధించాడా అని అందరకూ ఆశ్చర్యమే.

శ్రీమన్నారాయణ చేసేది తహశీల్దారు ఉద్యోగం. అప్పట్లో రెవెన్యూ డిపార్టుమెంటు సంగతి అందరికీ తెలిసిందే. నోరున్నవారికి కామధేనువులాంటి డిపార్టుమెంటు అది. రుచి మరిగి డబ్బులో పడినవాడికి అదే ప్రపంచం. మరొకటి కనుపించదు.

కాని శ్రీమన్నారాయణకు ఈ భగవద్గీత మీద ఎందుకు ఇంత శ్రద్ధ కలిగింది? ఇంత కృషి ఎందుకు చేశాడు? ఇంత వేదాంతం ఇంత చక్కగా ఎలా చెబుతున్నాడు? ఆచరణలో పాటించని వాడు ఈ విధంగా వేదాంతం చెప్పగలడా? ఎన్నో ప్రశ్నలు అక్కడ చాలామందికి ఎదురయ్యాయి.

శ్రీమన్నారాయణ పూర్వజన్మలో పుణ్యం చేసుకున్నాడు. ఇలాంటి వాళ్ళు ఇంకా ఉన్నారు కనకనే దేశం ఈ మాత్రంగానైనా ఉంది. స్వలాభం, లంచగొండితనం, దగా, దౌర్జన్యం పెరిగిపోతున్న ఈ రోజుల్లో శ్రీమన్నారాయణలే ఆశాజ్యోతులు అనుకున్నారు అక్కడ వింటూన్న వాళ్ళు.

"ఈ ప్రపంచంలో అన్ని అనర్థాలకు కారణం డబ్బు" అన్నాడు శ్రీమన్నారాయణ. "ఈ డబ్బుమీద ముందు మమకారం విడిచిపెట్టాలి. డబ్బు పాపిష్టిది. దీనివల్లే తండ్రికి కొడుకు, కొడుక్కి తండ్రి, భర్తకు భార్య, భార్యకు భర్త కాకుండా పోతున్నారు. డబ్బే నరకం. అందుకే ఈ పాపిష్టి డబ్బును పురుగు కంటే నీచంగా చూడాలి. అప్పుడే మన మనసు కోరికల నుండి విడివడుతుంది. శ్రేయోమార్గంలో పయనిస్తుంది. పరమాత్మను తెలుసుకుంటుంది. హోం తత్ సత్!" అంటూ కూర్చున్నాడు.

సభ ముగిసింది. కాని జనం శ్రీమన్నారాయణ చుట్టూ చేరారు. ప్రశ్నలు వేసి సంశయాలు తీర్చుకునే వారు కొందరు. సాష్టాంగ నమస్కారం చేసి ఆశీస్సులు పొందే వారు మరి కొందరు. అతడే అసలు శ్రీమన్నారాయణలా వాళ్ళందరకూ కనిపిస్తున్నాడు.

నిజానికి శ్రీమన్నారాయణ నాకు క్రొత్త కాదు. కాని అతడి ఉపన్యాసం వినడం క్రొత్తే.

అతడు నేనున్న ఇంటి యజమానే. అయినా అతడితో పెద్ద పరిచయం లేదనే చెప్పాలి. ఎక్కడో తాశీల్దారుగా ఉండి సంవత్సరానికో, ఆరు నెలలకో ఒకసారి వచ్చేవాడు.

ఇప్పుడు ఈ ఉపన్యాసం విన్న తర్వాత నాకు శ్రీమన్నారాయణపై భక్తి, గౌరవం ఏర్పడ్డాయి. ఇలాంటి మహానుభావుడి ఇంటిలో అద్దెకు ఉండడం నా పూర్వజన్మ సుకృతం అని నాలో నేనే ఆనందించాను.

ఆ సాయంత్రం శ్రీమన్నారాయణకు నా ఇంటిలోనే విందు భోజనం ఏర్పాటు చేశాను—భోజనం అయిన తరవాత నేనూ, అతడూ, నాతోపాటే అద్దెకు ఉన్న మూర్తి వరండాలో కూర్చున్నాము. ఏవో కబుర్లు సాగుతున్నాయి.

"మూర్తిగారూ! ఇక నేను రిటైరు అయిపో

తున్నాను. వచ్చే నెలలో మకాం మార్చేస్తాను. మీరు ఆ వాటా ఖాళీచేసి నాకు ఇవ్వాలి'' అన్నాడు శ్రీమన్నారాయణ మాటల మధ్యలో.

''మేడమీది వాటా మీ క్రిందే ఉందిగా? క్రింద వాటా కూడా కావాలా?'' మూర్తి ప్రశ్నించాడు కొంచెం ఇబ్బందిగా.

''క్రింద ఉండి ఇల్లు బాగుచేయించాలి.''

''సరే'' అంటూ అతడు చిరాకుగా లేచి లోపలకు వెళ్ళాడు.

''మరి నా మాటో?'' అన్నాను నేను.

''మీరా! మీరు ఖాళీచేయద్దు. నా నోటితో నేను మిమ్మలను ఖాళీ చేయమని అనను. మీరు ఎన్ని సంవత్సరాలు ఉండదలచుకుంటే అన్ని సంవత్సరాలూ ఉండండి'' అన్నాడు శ్రీమన్నారాయణ.

నా గుండె కుదుటపడింది. ఇల్లు మారడం అంటే యమలోకం చూసినట్టే. ఏదో సదుపాయంగా, సుఖంగా ఉన్న ఇల్లు విడిచి పెట్టడం అంటే మరీ ఇబ్బంది. శ్రీమన్నారాయణ వెళ్ళిపోయిన తరవాత ఈ విషయం మూర్తికి చెప్పాను.

''మీరు శ్రీమన్నారాయణను నమ్ముతున్నారా? మన ఇద్దరం ఇల్లు ఖాళీచేస్తే ఈ కొంప చూచేవాడు ఎవడు? అతడి అవసరం కోసం మిమ్మలను ఉపయోగించుకుంటున్నాడు. అంతే. నా మాట నమ్మండి. మన ఇద్దరికీ నేనే ఇల్లు చూస్తాను.''

''చూద్దాంలెండి'' అంటూ నా వ్యతిరేకతను సూచనగా వ్యక్తం చేశాను.

''ఇతగాడిని నమ్మకూడదు. మీరు చిన్న వాళ్ళు'' అంటూ మూర్తి నాకు చిలక్కి చెప్పినట్లు చెప్పాడు.

నా చేత కూడా ఇల్లు ఖాళీ చేయించి శ్రీమన్నారాయణ మీద కక్ష సాధించాలని మూర్తి అనుకుంటున్నాడని అనిపించింది నాకు. కారణం— శ్రీమన్నారాయణ ఉపన్యాసం. వేదాంతి. డబ్బును పురుగుకంటే నీచంగా చూసే మహానుభావుడు శ్రీమన్నారాయణ.

మూర్తి వారం తిరగకుండానే ఇల్లు చూశాడు. నాకూ అతడి ప్రక్క వాటా ఏభై రూపాయలకు చూశాడు. నచ్చ చెప్పి నన్నూ ఖాళీ చేయించడానికి ప్రయత్నించాడు. లాభం లేదనుకుని అతడు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు.

• • •

మూర్తి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళాడని తెలిసి శ్రీమన్నారాయణ రాజవరం వచ్చాడు. అతిథి సత్కారాలు ఘనంగా నేను చేశాను. అవి చేయడం నాకు మామూలే.

''నాకు ఒక్క సహాయం చేసి పెట్టాలి'' అన్నాడు శ్రీమన్నారాయణ. భోజనాలు అయి కబుర్లు చెప్పుకుంటూండగా. ''నా వ్యాఖ్యానంతో వ్రాసిన గీత మీ చేతుల మీదుగా ప్రింటు చేయించండి.''

''అంతకంటేనా! చెప్పండి'' అన్నాను. ఉపకారం చేయడం అంటే ఏదో ఘనకార్యం చేయడంలా భావించే వాళ్ళలో నే నొకడిని. నా దగ్గరకు వచ్చి ఎవరైనా ఏదైనా సహాయం కోరితేనే చాలు— ఉబ్బి తబ్బిబ్బు అయిపోతాను. దానిలో తల దూరుస్తాను. తరువాత ఎందుకు అందులో ఇరుక్కున్నానా అని ఏడుస్తాను. 'మీరు పట్టి అమాయకులు. అందరిని నమ్ముతా'రని నా శ్రీమతి చెప్పి పొడిచినా జ్ఞానోదయం కాలేదు.

భగవద్గీత వంటి కావ్యం ప్రపంచంలోనే లేదని చాటే వాళ్ళల్లో నే నొకడిని. మన దేశంలో ఎందరికో అదేమిటో తెలియక పోయినా, ఎందరో పాశ్చాత్యులు దాన్ని నెత్తిన పెట్టుకుని పూజిస్తున్నారన్నది నాకు తెలుసు. కనుక దానిని అచ్చు వేయడంలో సహాయపడడం నా అదృష్టంగా భావించాను. ఆ భారం నెత్తిన పెట్టుకున్నాను. రాత్రింబగళ్ళు కష్టపడి దాని ప్రూఫులు దిద్ది ప్రచురణ పూర్తి చేయించాను.

ఆ భగవద్గీత ప్రచురణ పూర్తి కావడం, శ్రీమన్నారాయణ కుటుంబ సమేతంగా రాజవరం రావడం ఒక్కసారి జరిగాయి. రిటైరు అయి సామానుతో వచ్చేశాడు. ఎన్ని లారీల సామాను వచ్చిందో నేను చెప్పలేను. అప్పటికే మేడమీద బోలెడు సామాను ఉంది.

రిటైరు అయిన వాడిని ఎవరు చూస్తారు?



అన్యోన్యం ఫోటో: కె. కుమార్

దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి. అదే పని శ్రీమన్నారాయణ చేశాడా అనిపించింది నాకు.

వెంటనే శ్రీమన్నారాయణ ఇల్లు బాగు చేయించడం మొదలు పెట్టాడు. పైన వాటరు టాంకు కట్టించి మోటారు పెట్టించాడు. ఇంటి నిండా కుళాయిలు పెట్టించాడు. రంగులు వేయించి ఇల్లు ఇంద్రభవనంలా చేయసాగాడు.

ఒక ప్రక్క వడ్రంగం పని వాళ్ళు. మరొక పక్క తాపీ మేస్త్రీలు, కూలీలు, పీళ్ళూ వాళ్ళూ అందరూ కలిసి ఒక కార్ఖానాలా తయారు చేశారు ఇంటిని. ఆ గోలలో నాకు స్థిమితం లేకుండా పోయింది. తలనొప్పి మొదలైంది.

''మూర్తి అన్నయ్య మాట విన్నారా? నా మాట విన్నారా? మంచి శాస్తి జరిగింది'' అని నా శ్రీమతి మంట మీద ఆజ్యం పోసింది. తప్పు చేసిన వాడిలా నోరు మూసుకుని కూర్చోవలసి వచ్చింది.

''మీకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నాను. మాతో బాధపడి ఎంతో సహాయం చేస్తున్నారు. ఈ విషయం నేను మరిచిపోను'' అన్నాడు శ్రీమన్నారాయణ ఆ సాయంత్రమే.

ఆ మాటలతో అప్పటి వరకూ నాలో ఉన్న బాధ ఎగిరి పోయింది. శ్రీమన్నారాయణ సహృదయుడు కూడా అనిపించింది. ఇంటి వాడు ఇంట్లో ఉన్నవాడిని లెక్క చేస్తాడా? పైగా శ్రీమన్నారాయణ లాంటివాడు! లక్షలు మూరుగు తున్నాయి. ఇక బంగారం ఎంతుందో దేవుడికే తెలియాలి. తామరాకు మీద నీటి బొట్టులా జీవితం గడుపుతున్నాడు కనుకే అంత సహృదయత, అంత మంచితనం అనుకున్నాను. ఇంటి పనులలో నా శ్రీమతి వద్దంటున్నా మరింత సాయం చేశాను. పనులు పూర్తి అయ్యాయి.

శ్రీమన్నారాయణ మకాం మేడ మీదకు మార్చాడు.

• • •

ఒక రోజు సాయంత్రం అప్పుడే ఇంటికి వచ్చాను. కాఫీ త్రాగి కూర్చున్నాను. శ్రీమన్నారాయణ నన్ను మేడ మీదకు రమ్మని కబురు పెట్టాడు.

ఇంటి వాడు పిలిస్తే అద్దెకున్న వాడు వెళ్ళాలి— తప్పదు అనుకుంటూ పైకి వెళ్ళాను. మర్యాద చేసి కూర్చో మన్నాడు. కుశల ప్రశ్నలు వేశాడు. నా మీద చూపుతున్న అభిమానం పైకి పిలిపించాడే అన్న బాధను మరపించింది.

''ఇల్లు అంతా నా క్రిందే ఉంచుకున్నా నాకు లోటు లేదు. కాని మాకు తోడుకోసం అద్దెకు ఇస్తున్నాను'' అంటున్న శ్రీమన్నారాయణ మొదట అర్థంకాలేదు.

''ఎంత డబ్బు ఇంటి మీద పెట్టానో మీరే చూశారు. ఎన్ని సదుపాయాలు కలగ చేశానో మీకే తెలును.'' కొంచెం కొంచెం తెలుస్తున్నది ఆయన అంతర్యం.

''అద్దె కోసం లెక్క చేయరని నాకు తెలుసు—'' అంటూ ముందర కాళ్ళకు బంధం వేశాననుకున్నాను.

''అది నిజమే అనుకోండి. నేను రిటైరు అయ్యాను కదా! పెన్షను రాదు. కొన్ని నెలలు అద్దెమీదే బ్రతకాలి. చేతిలో ఉన్నదంతా ఖర్చు

అయి పోయింది. కనుక మీరు వచ్చే నెల నుండి వంద రూపాయలు ఇవ్వండి."

"నలభై నుండి ఒక్కసారి వంద రూపాయలే?" నా నెత్తిన పిడుగు పడినట్లయింది. "కొంచెం ఆలోచించండి" అన్నాను ధైర్యం కూడ దీసుకుని.

"నేను ఆలోచించడానికి ఏమీ లేదు. నేను మాట అంటే మాటే. మీ ఇష్టం. తక్కువకు వచ్చే ఇళ్ళు ఉంటాయి."

నా కళ్ళు తిరిగినట్లయ్యాయి. ఒక్క క్షణం నా పాదాల కింద భూమి కుంగిపోతున్నట్లనిపించింది. కాస్సేపటికి తేరుకున్నాను. 'సరే' అని కిందకు వచ్చాను. విషయం శ్రీమతికి చెప్పాను. నన్ను వెర్రివాడుగా జమకట్టింది తను.

ఆ మరునటి రోజే శ్రీమన్నారాయణ ముస్పై మేము పక్క ఇంటి వాడికి అప్పిచ్చినట్లు నా శ్రీమతి చల్లగా చెవిని వేసింది.

"ఇప్పుడైనా మూర్తి అన్నయ్యతో చెప్పండి" అంటూ ఆమె నన్ను మరోకసారి వెర్రికుంక కింద లెక్కకట్టి మాట్లాడింది.

మౌనంగా వూరుకున్నాను.

● ● ●

సాయంత్రం నాలుగు దాటింది. లోపల పేపరు చూస్తున్నాను. పిల్లలు పక్క సందులో క్రికెట్టు ఆడుతున్నారు. బంతి వెళ్ళి గోడకు తగులుతూంది అప్పుడప్పుడు. అదే వికెట్టు కూడా కనుక శబ్దం వస్తూంది. దానితో శ్రీమన్నారాయణ మేడమీదించి దిగి వచ్చాడు.

"అబ్బాయిలూ! ఇది ఇల్లు. క్రికెట్టు గ్రౌండ్ కాదు. మీ క్రికెట్టుతో నా గోడ కాస్త కూల గొట్టకండి. బయటకు పొండి" అంటూ శ్రీమన్నారాయణ కసిరాడు.

"గోడ పడిపోతుందా?" ఆడుతూన్న వాళ్ళలో ఎవరో అనడం, అందరూ ఫక్కుమని నవ్వడం ఒక్కసారి జరిగాయి.

నన్ను చూసి పిల్లలు అందరూ నిశ్శబ్దం అయ్యారు. అన్నీ పట్టుకుని మైదానంలోకి జారుకున్నారు.


రబ్బరు బంతికి గోడ పడిపోతుందా? ఈ గోడలూ, ఈ ఇళ్ళూ—ఇవన్నీ శాశ్వతమా? వెంట వస్తాయా? రావు అని శ్రీమన్నారాయణ ఉపదేశించే నిష్కామ కర్మయోగం గోడ పడిపోవడంలోనే ఉందేమో! నాకు నవ్వు వచ్చింది. చెప్పేవి శ్రీరంగనీతులు అనుకున్నాను.

● ● ●

ఒక సంవత్సరం సుఖంగానే గడిచిందని చెప్పాలి. అప్పుడు నా వాటా కున్న కరెంటు మీటరు తిరగడం మానేసింది.

కొన్ని నెలల కిందటే ఆ మీటరు నా వాటాకు పెట్టించి, నా మీటరు తన వాటాకు మార్పించాడు శ్రీమన్నారాయణ. ఎందుకు ఇలా మార్పించారని అడిగితే ఏవేవో చెప్పాడు. అలా చేయవద్దు అనే అధికారం అద్దెకున్న వాడికి లేదు కనుక మాట్లాడక వూరుకున్నాను.

నా మీటరు తిరగడం మానేసేసరికి నాకు అనుమానం వచ్చింది. ఇందులో ఏదో మతలబు




ఉందనిపించింది. కాని తొందరగా చెడు ఆలోచించ కూడదని సరిపెట్టుకున్నాను.

మీటరు ఆగిపోయిన విషయం శ్రీమన్నారాయణకు చెప్పాను. "ఆగిపోయిందా? పైన బాగానే తిరిగిందే" అంటూ అతడు కిందికి మార్చిన తరవాత అది పాడై పోయినట్లు ముఖం పెట్టాడు. "సరే! ఎలక్ట్రీషియనుకు కబురు చేస్తాను."

ఆ మరునాడే ఎలక్ట్రీషియను వచ్చాడు. అప్పుడు శ్రీమన్నారాయణ ఇంట్లో లేడు. కిందకు వచ్చి అతడు మీటరు పరీక్ష చేస్తున్నాడు.

"ఈ మీటరు తిన్నగా ఉందా? ఇది ఇక్కడ పెట్టినప్పటి నుండి కరెంటు రెట్టింపు అవుతూంది. కారణం తెలియడం లేదు. ఇప్పుడు ఆగిపోయింది" అన్నాను నేను ఆ పరీక్ష చేస్తున్న వాడితో.

"మీటరులో తప్పుంది."

"అయితే దీన్ని నీవేగా ఇక్కడ బిగించావు. ఆ విషయం ఇంటాయనకు చెప్పలేదా?"

"చెప్పానండి. ఆయన పెయ్యమంటే నేను ఏం చేయగలను చెప్పండి?"

"అయితే నా చేత ఎలక్ట్రిసిటీ వాళ్ళకు డబ్బు పోయిస్తున్నాడన్న మాట." నాకు శ్రీమన్నారాయణ చేసిన పనికి నిజంగానే కోపం వచ్చింది. నేను ఎందుకు మీటరు మారుస్తున్నారని అడిగితే అబద్ధం చెప్పాడు. వీడి వేదాంతం మండిపోను!

"వాళ్ళకు కాదు. మీ ఇంటి ఆయనకే పోస్తున్నారు. మెయిన్ మీటరు ఎక్కువ తిరగదులే?"

ఆ మాటలు వినేసరికి నాకు నిజంగానే మతి పోయింది. ఒకసారి నాకు కరెంటు రెట్టింపు అయి పోతూంది అన్నాను శ్రీమన్నారాయణతో. "మీటరు అబద్ధం ఆడుతుందా? మోసం చేస్తుందా?" అని ఏదో పెద్ద జోకు వేసినట్లు నవ్వాడు.

"మీటరు అబద్ధం ఆడదు. మనిషి మాత్రం ఆడతాడు." లోపలే గొణుక్కున్నాను. కాని పెంచిన ఇంటి అద్దె సరిపోలేదా? ఈ పాడు పని చేస్తాడా? డబ్బు మీద మమకారం వదులుకోమని గీతోపన్యాసాలు

చెబుతాడు. ఆ మమకారం వదులుసున్నట్లు నలుగురికీ కనిపిస్తాడు. చూడటానికి సర్వసంగ పరిత్యాగం చేసిన యోగిలానే ఉంటాడు. ఏమిటీ మనిషి? మనస్సు పరిపరి విధాల పోయింది.

శ్రీమన్నారాయణ లాంటి వేదాంతి, జ్ఞాని గడ్డి తినడు. ఆ ఎలక్ట్రీషియను మాటలు నమ్మ కూడదని నిర్ణయించుకున్నాను.

రెండు రోజులలో మీటరు బాగు చేయించడం తిరిగి దానిని అమర్చడం జరిగింది.

● ● ● ●

రాజవరంలో ఎక్కడ చూసినా శ్రీమన్నారాయణ పేరు కనపడుతూంది. ఎన్నోచోట్ల అతడి ఉపన్యాసాలు వినబడుతున్నాయి. చూస్తూండగా అక్కడ గొప్ప పేరు తెచ్చుకున్నాడు.

అతడి పేరు రాజవరంతో ఆగిపోలేదు. చుట్టు పక్కల వూళ్ళకు ఆ పేరు పాకింది. రోజూ ఎందరో వస్తున్నారు. గీతోపన్యాసాలకు ఆహ్వానిస్తున్నారు. తీసుకెళ్ళి గీతామృతం అతడి నోటి నుండి విని ఘనసత్కారాలు చేస్తున్నారు.

ఎక్కడెక్కడి నుండో వచ్చి గీతాయజ్ఞాలు జరిపించమంటున్నారు. శ్రీమన్నారాయణ వెళ్ళి ఆ యజ్ఞాలు చక్కగా జరిపించి వస్తున్నాడు.

రిటైరు అయ్యాడన్న మాటే కాని శ్రీమన్నారాయణకు ఉద్యోగం చేసినప్పటి కంటే హడావుడి ఎక్కువైంది. సత్కారాలు, సన్మానాలూ ఎక్కువయ్యాయి.

ఎందరో శ్రీమన్నారాయణకు రాజవరంలో శిష్యు లయ్యారు. భక్తబృందం కూడా అతడి చుట్టూ చేరింది. వాళ్ళ ధర్మమా అంటూ అతడి పేరు వూరూ వూరూరా మారుమోగింది.

ఎక్కడి ఎక్కడినుండో భక్తులు రావడం మొదలైంది. వచ్చిన వాళ్ళకు శ్రీమన్నారాయణ భగవద్గీత ఇస్తాడు. ఆ భగవద్గీత మీద మూల్యం "శ్రద్ధ" అనే ఉంటుంది. కాని భగవద్గీత తీసుకున్న వాడు వాడి తాహతు కొద్ది అంచో, పదో చేతిలో పెట్టి వెళుతున్నారు.

"దీని మూల్యం శ్రద్ధ. నాకు డబ్బు వద్దు" అంటాడు శ్రీమన్నారాయణ. వాళ్ళు బలవంతం చేస్తారు. ఏదో అయిష్టంగా ఆ డబ్బు తీసుకుంటాడు. 'కృష్ణార్పణం' అంటాడు.

• • • •

ఆ రోజు జనవరి ఒకటి.

శ్రీమన్నారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి పైకి వెళ్ళాను. అభినందనలు తెలియజేశాను.

ప్రతి నెలా మొదటి తారీఖున అద్దె ఇవ్వడం అలవాటు కనుక అద్దె విషయం ప్రస్తావించాను. శ్రీమన్నారాయణ లోపలికి వెళ్ళి ఒక చీటీ తీసుకు వచ్చి నా కిచ్చాడు.

ఆ చీటీమీద అప్పుడు నేను ఇవ్వవలసిన అద్దె వివరాలు ఉన్నాయి. మీటరు బాగు చేయించినందుకు పది రూపాయలు చార్జీకూడా ఆ చీటీలో ఉంది. మీటరు తిరగనందుకు పనిష్మెంటుగా ప్రతి నెలకంటే రెండు రూపాయల కరెంటు చార్జీ ఎక్కువ వేసి ఉంది.

"మీటరు బాగు చేయించినందుకు నేను పది రూపాయలు ఇవ్వాలా? అసలు ఆ మీటరు ఎవరి వాటా కుండేది? ఎందుకు అది మార్చవలసి వచ్చింది? ఈ మీటరు పెట్టినప్పటి నుండి నాకు అవుతూన్న ఎక్కువ కరెంటు చార్జీ కంటే రెండు రూపాయలు ఇవ్వాలా?" నాకు ఒళ్ళుమండి అడిగాను— "ఇదెక్కడి న్యాయం?"

"మీ వాటా మీటరు బాగు చేయించినందుకు మీరే ఇవ్వాలి. నా వాటా కుండగా అది బాగానే తిరిగింది. మీ ఇస్త్రీపెట్టె ఇవీ అవీ ఉపయోగిస్తే పాడైంది!"

'ఓరిగుంటనక్కా! నీ భగవద్గీతోపన్యాసాలు మండిపోనూ! నీ నిష్కామకర్మ యోగం తగలెయ్యా! ప్రజలను మోసం చేయడానికేనా నీ నీతులన్నీను! తామరాకుమీద నీటి బొట్టులా జీవితం గడపడం అంటే ఇదేనా?' అని లోపలే అతడిని నిందించాను.

"అంత బాగున్న మీటరు నా వాటాకు ఎందుకు వేయించారు?" నేను ప్రశ్నించాను. "మీరే ఉంచుకో లేకపోయారా?"

"ఇప్పుడు అవన్నీ అనవసరం. మీకు ఇష్టం అయితే ఉండండి. లేకపోతే ఖాళీ చేయండి."

ఇంటి వాళ్ళకు ఇదో పెద్ద తెగులు. ఇష్టం అయితే ఉండండి" అనడం. "అది మీరు చెప్ప నక్కరలేదు" అన్నాను.

తన నోటితో తను ఖాళీ చేయమని అనను అన్న శ్రీమన్నారాయనేనా ఇతను!

"ఈ నెలనుండి అద్దె నూటయాభై రూపాయలు చేస్తున్నాను."

"ఇవ్వకపోతే?"

"ఖాళీ చేయండి."

"ఖాళీ చేయను. నేను అద్దె పెంచను." ఆవేశంగా అనేసి తిరిగి చూడకుండా కిందికి దిగి వచ్చాను.

శ్రీమన్నారాయణ ఉదయాన్నే లేచి స్నానం చేసి పూజా పునస్కారం మొదలు పెడతాడు. ఆ కార్యక్రమం పూర్తి అయ్యే సరికి తొమ్మిది అవుతుంది.

ఒక రోజు ఉదయం ఆ కార్యక్రమం పూర్తి చేసుకుని వరండాలోకి వచ్చాడు. "నమస్కార మండి" అంటూ నలుగురు వ్యక్తులు పైకి వచ్చారు.

శ్రీమన్నారాయణ వాళ్ళను లోపలకు ఆహ్వానించాడు. అలా ఎవరో వ్యక్తులు ఎక్కడెక్కడ నుంచో రావడం పరిపాటే.

"మీ గురించి విన్నాము, బాబూ!" 'అంటూ తిరిగి దణ్ణం పెట్టారు. "మీరు మహా పురుషులని, మీ దర్శనం చేసుకుంటే పాపాలు పోతాయని విన్నాము. మీరు మా వూరులో గీతా యజ్ఞం చేయించాలి." ప్రాధేయ పూర్వకంగా అడిగాడు వారిలో పెద్ద.

"సరే కాని. . ." నసిగాడు శ్రీమన్నారాయణ.

"మాకు తెలుసు, బాబూ!... మీకు ఘనంగా సన్మానం చేస్తాము. వేయి నూట పదహార్లు నూతన వస్త్రాలు. . ."

"దానికేమిలెండి!" శ్రీమన్నారాయణ ప్రసన్నమయ్యాడు. "నే నన్నది అదికాదు. తప్పక వస్తాను."

"మీ వ్యాఖ్యానంతో ఉన్న భగవద్గీత ఒకటి మాకు ప్రసాదించండి."

"తప్పకుండా" అంటూ శ్రీమన్నారాయణ లేచాడు. అతడితోపాటు నలుగురూ వినయంతో నిలబడ్డారు. శ్రీమన్నారాయణ వెనుతిరిగి గదిలోనికి నడిచాడు. అంతే! ఏం జరిగిందో శ్రీమన్నారాయణకు తెలీదు.

వెనకాలే వచ్చి ఒకడు నోరు నొక్కేశాడు. మరొకడు ఏదో దుడ్డు కర్ర తీసుకొని నెత్తిన బాదాడు. శ్రీమన్నారాయణ బుర్ర పగిలింది. నెత్తురు చిమ్మింది. 'అబ్బా' అంటూ నెత్తి పట్టుకుని అతడు కుప్ప కూలిపోయాడు.

మిగిలిన ఇద్దరూ లోనికి వెళ్ళారు. శ్రీమన్నారాయణ భార్యకు కత్తి చూపించారు. ఒంటి మీద నగలన్నీ లాక్కున్నారు. బీరువా ఆమె చేత తెరిపించారు. అందులో ఉన్న బంగారం వస్తువులు, డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు.

అయిదు నిముషాల వరకూ శ్రీమన్నారాయణ భార్యకు ఏం జరిగిందో అర్థంలేకాదు. బయటికి వద్దామంటే బయట గొళ్ళెం పెట్టేశారు. అప్పుడు పెద్దగా అరిచింది.

నేను, నా భార్య మేడ మీదకు పరుగెత్తుకు వెళ్ళాం. అక్కడ కనిపించిన ఘాతుక కృత్యం దిగ్భ్రాంతి కలగ చేసింది. శ్రీమన్నారాయణ రక్తం మడుగులో ఉన్నాడు.

వెంటనే శ్రీమన్నారాయణను హాస్పిటలుకు చేర్చాము. దారిలో నా బుర్రనిండా దేశంలోని అరాచకం గురించి ఆలోచనలే. ఎక్కడ చూసినా దొంగతనాలే—రైళ్ళలో, రోడ్లమీద ఎక్కడ పడితేఅక్కడ దోపిడీలే. పట్టపగలే ఆడ వాళ్ళ మెళ్ళో పుస్తెలు తెంపుకు పోతున్నారు. ఎదురు తిరిగితే ప్రాణాలు తీస్తున్నారు.

రక్తం వెంటనే ఎక్కిస్తేకాని శ్రీమన్నారాయణ బ్రతక డన్నాడు డాక్టరు. అతడి భార్య రక్తం ఇస్తానంది. అది పనికి రాలేదు.

నా రక్తం పనికి వస్తుందన్నాడు డాక్టరు. కాని నారక్తం దానం చేసి ఈ శ్రీమన్నారాయణను బ్రతికించడమా? భగవద్గీత పేరుతో సంపాదించే డబ్బు విషయం, నాకు చేసిన అన్యాయం గుర్తుకు వచ్చాయి. నా రక్తం ఇచ్చి అతడిని బ్రతికించ కూడదనిపించింది. అంతలోనే నాలోని మానవత్వం పైకి వచ్చింది.

నా రక్తం తీసుకోమని డాక్టరుకు చెప్పాను. వెంటనే ఏర్పాటులన్నీ జరిగాయి. నా రక్తం బయటకు ప్రవహిస్తూంటే దాని వెంట ఆలోచనలు సాగాయి.

రాజవరంలో ఇంత మంది ఉంటే వాళ్ళెవరో పాపం ఈ శ్రీమన్నారాయణ బుర్ర పగల గొట్టాలా? అతడి బంగారమూ డబ్బే పట్టుకు పోవాలా? ఏమిటీ విధి విలాసం

"డబ్బు పాపిష్టిది" అని ఒకనాడు శ్రీమన్నారాయణ ఉపన్యాసంన చెప్పిన మాటలు పదే పదే చెవిలో ప్రతిధ్వనించాయి. ★

